
manachourasta

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా Telugu News Channel

సంపుటి : 01 | సంచిక : 225 | శనివారం | 15.02.2025



2లో

## అధికారం పోయి ఆగమైతున్నరు

- మీడియాలో కనిపించకపోతే వాళ్లకి బీపీలు పెరుగుతున్నయ్
- బీఆర్ఎస్‌పై స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం కాంమెంట్

బీఆర్ఎస్ నేతలు అధికారం కోల్పోయి ఆగమాగమై మతి బ్రమించి మాట్లాడుతున్నారని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి విమర్శించారు. జనగామ జిల్లా స్టేషనన్‌ఘన్‌పూర్‌లో శుక్రవారం సంతు సేవాలాల్ మహారాజ్ ఉత్సవాల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కడియం మాట్లాడారు.



3లో

## వీర జవాన్ల త్యాగాలు మరువలేనివి..




## ఆహార భద్రతను పాటించాలి

- సురక్షితమైన ఆహారాన్ని అందించాలి
- 16 నుంచి మరోసారి కులగణన
- కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



3లో



## మేడారంలో భక్తుల రద్దీ

- కొనసాగుతున్న తల్లుల దర్శనాలు
- మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

2లో

General News

# అధికారం పోయి ఆగమాగమైతున్నరు

- మీడియాలో కనిపించకపోతే వాళ్లకి బీపీలు పెరుతున్నయ్
- బీసీ రిజర్వేషన్ల గురించి కవితకు ఏం అవసరం..?
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం




**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** బీఆర్ఎస్ నాయకులు అధికారం కోల్పోయి, ఆగమాగమై మతి భ్రమించి మాట్లాడుతున్నారని స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి విమర్శించారు. జనగామ జిల్లా స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గ కేంద్రంలో సంతు సేవాలాల్ మహారాజ్ ఉత్సవాల సన్నాహక సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తెల్లారి లేస్తే కాంగ్రెస్ ప్రభుత్వంపై దుమ్మెత్తి పోయడమే బీఆర్ఎస్ పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు ఎంత తొందర పడినా 4 ఏళ్ల తర్వాతనే ఎన్నికలు వస్తాయని అన్నారు. ఒకవేళ ఉప ఎన్నికలు వస్తే ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. నిన్న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమయంలో మిగులు బడ్జెట్ తో ఉన్న రాష్ట్రం 10 ఏళ్ల తర్వాత అప్పుల కుప్పగా మారిందని చెప్పారని అన్నారు. ఇది బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి అని దుయ్యాబట్టారు. బీఆర్ఎస్ నాయకులకు వింత జబ్బు సోకిందని, ప్రతీ రోజు మీడియాలో, పేపర్లలో కనిపించకపోతే బీపీ పెరుగుతుందని ఏద్దేవా చేశారు. కేవలం మీడియా సమావేశాలు పెట్టడానికే జిల్లాలకు వెళ్తున్నారని ఈ వింత జబ్బు ఎక్కువగా కేటీఆర్, కవితలకే ఉందన్నారు. బీసీ రిజర్వేషన్ల గురించి కవితకు ఏం అవసరమని, ఆమెను ఎవరు అడిగారని ఎమ్మెల్యే ప్రశ్నించారు. అవకాశవాదం విషయానికి వస్తే కవిత కంటే పెద్ద అవకాశావాది మరొకరు ఉండరని స్పష్టం చేశారు. ఈనెల 19న నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించే సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించినట్లు ఆయన వెల్లడించారు. నియోజకవర్గ కేంద్రంలో బంజారా భవన్ నిర్మించేందుకు రూ. 2 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసిలు రాజేష్ నాయక్, స్వామి నాయక్, చింతకుంట్ల నరేందర్ రెడ్డి, బూర్ల శంకర్, పల్లె రవి, గాండ్ల రాజు వివిధ గ్రామాల గిరిజనులు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.



# జిల్లా స్థాయి కబడ్డీ క్రీడోత్సవాల ప్రారంభం

స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా : జనగామ జిల్లా స్టేషన్ ఘన్ పూర్ మండలం పాముమూరులో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి కబడ్డీ క్రీడోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రోళ్ల కుమార్, ప్రధాన కార్యదర్శి తోటకూరి గట్టయ్య, జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ పోగుల సారంగపాణి, మండల ప్రధాన కార్యదర్శి, జిల్లా సంయుక్త కార్యదర్శి తోటకురి వెంకటేశ్వర్లు, మండల కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఇనుగాల గణేష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నరేందర్, పొన్న బీరయ్య, ఒగ్గు రాజు, జీవన్ రెడ్డి, అన్వర్ బాషా, సలీం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆఫీషియల్స్ అన్నెపు కుమార్, సుధాకర్, రాజన్న, రాజు, చందర్, మహేష్, సఫీర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈనెల 20న వికారాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడోత్సవాల్లో పాల్గొని క్రీడాకారుల ఎంపిక జరిగింది.



# తల్లుల దర్శనాలు మొదలు

**మొక్కులు చెల్లిస్తున్న భక్తులు-**

**జనంతో కిటకిటలాతున్న మినీ మేడారం**

**మన చౌరాస్తా, ములుగు ప్రతినిధి :** మినీ మేడారం జాతర సందర్భంగా వనదేవతల ప్రాంగణాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. బుధవారం జాతర ప్రారంభం కాగా మూడో రోజై శుక్రవారం భక్తుల తాకిడి మరింత పెరిగింది. వన దేవతల దర్శనాల కోసం భక్తులు క్యూకట్టారు. సుదూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు ముందుగా జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించి అక్కడి నుంచి కాలినడకన అమ్మవార్ల దర్శనానికి క్యూలైన్‌లకు చేరారు. జాతర ప్రారంభమై మూడో రోజు కావడంతో భక్తుల రద్దీతో సమ్మక్క సారలమ్మల గద్దెల ప్రాంగణాలు కిటకిటలాడాయి. అమ్మవార్లను దర్శించుకున్న భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. కొబ్బరికాయలతో పాటు బంగారాన్ని అమ్మవార్లకు సమర్పించి మొక్కులు చెల్లిస్తున్నారు. కొంతమంది మహిళలకు ఓడిబియ్యం సమర్పించారు. గుడి పూజారులు భక్తుల కానుకలు స్వీకరిస్తూ అమ్మవారి ప్రసాదాలు అందజేశారు. అయితే మినీ జాతర సందర్భంగా ప్రభుత్వం చేసిన ఏర్పాట్లతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగలేదు. అధికారులు, పోలీసుల ప్రత్యేక పర్యవేక్షణలో మినీ మేడారం జాతర జరుగుతోంది. భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేయడంతో అమ్మవార్ల దర్శనాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగుతున్నాయి.



# అధికారులతో ఆర్డీవో సమీక్ష

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** జనగామ జిల్లా స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గ కేంద్రంలో ఈనెల 19న నిర్వహించే సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల నిర్వహణపై డిఆర్డిఓ వసంత, ఆర్డిఓ డిఎస్ వెంకన్న తాసిల్దారులు, ఎంపీడీవోలు నిర్వహణ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల కమిటీ సభ్యులు స్వామి నాయక్, రాజేష్ నాయక్, హుస్సేన్ నాయక్, జుంకీలాల్, రామచంద్రనాయక్, వెంకటేష్, సంజీవ, రవి నాయక్, శ్రీనివాస్ అధికారులు పాల్గొన్నారు.



Local News




# ఆహార భద్రతను పాటించాలి

- **సురక్షితమైన ఆహారాన్ని అందించాలి**
- **కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్**

**జనగామ, మన చౌరాస్తా :** వ్యాపారులు, హోటళ్ల యజమానులు వినియోగదారుల నాణ్యత ప్రమాణాలతో కూడిన ఆహార పదార్థాలను అందించాలని, లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా హెచ్చిరించారు. శుక్రవారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆహార పరిరక్షణ, ప్రమాణాల శాఖ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్, డీసీపీ రాజమహేంద్ర నాయక్‌తో కలిసి కలెక్టర్ ఆహార భద్రతపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆహార భద్రతపై ఆహార తయారీ, విక్రయదారులకు ముందుగా అవగాహన కార్యక్రమం చేపట్టాలని ఆహార భద్రత అధికారులకు సూచించారు. ముందుగా యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలని, షెడ్యూలు కూడా ఇవ్వాలని, సంబంధిత అధికారులను ఆదేశించారు. వినియోగదారులను ఆకర్షించేందుకు ఆహారంలో వినియోగిస్తున్న హానికర రంగులు, నిషేధిత మయనిస్ వినియోగిస్తే జరిగే పరిమాణాలపై విక్రయదారులకు శిక్షణ కార్యక్రమం కూడా ఏర్పాటు చేయాలన్నారు. ఆహార భద్రత కై సంబంధిత అధికారులతో టాస్క్ ఫోర్స్ బృందం ఏర్పాటు కావాలని, విస్తృత తనిఖీలు చేపట్టాలన్నారు. జిల్లా టాస్క్ ఫోర్స్ బృందం ఆకస్మికంగా పర్యవేక్షణలు చేయాలన్నారు. ఆహార భద్రతలో నియమ నిబంధనలు పాటించని వారిపై తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ మల్లికార్జున రావు, మహిళా శిశు సంక్షేమ అధికారిని ఫ్లోరెన్స్ , వ్యవసాయ శాఖ అధికారి రామారావు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఆహార భద్రత శాఖ ఉమ్మడి జిల్లాల అధికారి కృష్ణమూర్తి, జిల్లా అధికారి వినీల్, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు సాధిక్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో మరోసారి కులగణన

### 16 నుంచి 28 వరకు సర్వే..

**జనగామ, మన చౌరాస్తా :** తెలంగాణలో తొలిసారి చేపట్టిన కులగణన సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే)లో ఎవరైతే వివిధ కారణాలచే పాల్గొనలేదో అటువంటి వారి కోసం మరోసారి సర్వే నిర్వహణ ఉంటుందని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16 నుంచి 28 వరకు సర్వేను నిర్వహిస్తామని, టోల్ ఫ్రీ నంబర్ 90523 08621కి ఫోన్ చేయవచ్చని, ప్రజాపాలన సేవా కేంద్రాల్లో అలాగే ఆన్‌లైన్‌లో ఫారాలను డౌన్ లోడ్ చేసుకొని దానిని సంబంధిత ప్రజాపాలన కేంద్రాలలో ఇచ్చి ప్రజలు తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, సర్వేకు సహకరించాలని కోరారు.



## పాలకుర్తిలో గంజాయి పట్టివేత

**పాలకుర్తి, మన చౌరాస్తా :** జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో రెండు రోజుల క్రితం పట్టుకున్న గంజాయి వివరాలను పోలీసులు శుక్రవారం మీడియాకు వెల్లడించారు. సీఐ మహేందర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పాలకుర్తిలోని ఆర్టీసీ బస్టాండ్ బస్టాండ్ సెంటర్లో మూడు బ్యాగులతో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను సంచరిస్తున్నారు. పోలీసులు వారిని పట్టుకుని విచారించగా.. మహారాష్ట్రకు చెందిన వ్యక్తులుగా తెలిపారు. వారు ఒరిస్సా నుంచి గంజాయి కొనుగోలు చేసి మహారాష్ట్రకు తరలిస్తున్నారని, వరంగల్ లో పోలీసుల తనిఖీలు ఎక్కువగా ఉండటంతో పాలకుర్తి మీదగా హైదరాబాద్ కు వెళ్లే క్రమంలో పట్టుబడ్డారన్నారు. 32 కేజీల గంజాయి, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించామని సిఐ తెలిపారు. పట్టుకున్న గంజాయి విలువ సుమారు రూ.7.50 లక్షల వరకు ఉంటుందన్నారు. ఎస్సైలు పవన్ కుమార్, అహ్మద్, సృజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆగని అక్రమ అరెస్టులు

- **ఖండించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి**

**వరంగల్ , మన చౌరాస్తా :** మరోసారి ఆర్జీ టీవీ జర్నలిస్టు రాజ్ కుమార్ అక్రమ అరెస్ట్ చేశారు. ఈ అరెస్టును మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఖండించారు. ప్రజాపాలాన అంటిరి కనీసం ప్రజల గొంతు కాదు కదా ప్రజల సమస్యలు వినిపించే జర్నలిస్ట్ గొంతు కూడా ఎత్తకుండా చేయ బడితిరి అని విరుచుకుబడ్డారు. మీకు చేతనైతే జర్నలిస్ట్ లు వినిపించే సమస్యలు పరిష్కరించండి , అది చేతకాక వారి గొంతు నొక్కే ప్రయత్నం చేయకండని అన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకొని తన యూట్యూబ్ ఛానల్ ద్వారా ప్రభుత్వానికి, ప్రజలకి తెలియ చేయటం అతను చేసిన తప్పా అని ప్రశ్నించారు. కేటీర్ కొడంగల్ ప్రచారంలో భాగంగా అక్కడి ప్రజల ఆవేదనను తన యూట్యూబ్ ఛానల్ ద్వారా ప్రజల్లోకి తీసుకు వెళ్లడం ఇతను చేసిన తప్పా అన్నారు. ఆర్ జీ టీవీ రాజ్ కుమార్ బషీరబాగ్ సైబర్ క్రైమ్ ఆఫీస్ లో ఉన్న విషయం తెలుసుకొని అక్కడికి వెళ్లి అక్కడి డీసీపీ క్రైమ్ అధికారులతో మాట్లాడి రాజ్ కుమార్ కి ధైర్యం చెప్పారు. ఇలాంటి తప్పుడు కేసులు పెట్టి ఎందరిని జైలుకు పంపుతారు అని భేషరతుగా విడుదల చేయాల ని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.



## వీర జవాన్ల తాగ్యాలు మరువలేం..




**జనగామ, మన చౌరాస్తా :** దేశ రక్షణలో వీరమరణం పొందిన జవాన్ల త్యాగాలు మరువలేనివని రిటైర్డ్ ఆర్మీ ఎక్స్ సర్వీస్ మెన్ అస్సోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కల్నల్ భిక్షపతి అన్నారు. 2019 ఫిబ్రవరి 14న పుల్వమాలో భారత సైన్యంపై జరిగిన ఉగ్ర దాడిలో మరణించిన వీర జవాన్లకు శుక్రవారం జనగామ పట్టణంలోని కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి ఆర్టీసీ చౌరస్తాలో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ పుల్వామాలో జరిగిన ఉగ్ర దాడిలో మరణించిన వీర జవాన్ల త్యాగాన్ని గుర్తు చేసుకున్నారు. ఆర్మీలో విధులు నిర్వహిస్తున్న జవాన్లను ఈ తరం యువకులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎక్స్ సర్వీస్ మెన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్, కోశాధికారి సయ్యద్ యూసఫ్, సభ్యులు సోమయ్య, అంజనారెడ్డి, కుమార్ యాదవ్, సందీప్, నిరంజన్ పాల్గొన్నారు.



# అబ్బో బేబమ్మ

## - చూపులతో చంపేస్తోంది

ఉప్పెన సినిమాతో తెలుగు వెండితెరకు పరిచయమైన ముద్దుగుమ్మ కృతి శెట్టి. మొదటి సినిమాలోనే తన అందంతో టాలీవుడ్ ఆడియన్స్ మనసు దోచుకుంది ఈ అమ్మడు. బేబమ్మగా తెలుగు కుర్రకారు డ్రీమ్ గర్ల్‌గా మారిపోయింది. ఎంట్రీ ఇవ్వడంతోనే బ్లాక్ బస్టర్ హిట్ అందుకోవడంతో ఈ అమ్మడుకు ఆఫర్స్ క్యూ కట్టాయనే చెప్పాలి. బంగార్రాజు, కస్టడీ, శ్యామ్ సింగ రాయ్, మనమే, ఈ అమ్మాయి గురించి మీకు చెప్పాలి. ది వారియర్, మాచర్ల నియోజక వర్గం వంటి చాలా సినిమాల్లో నటించి మెప్పించింది. అయితే ఈ ముద్దుగుమ్మ చేసిన సినిమాల్లో బంగార్రాజు, ఉప్పెన సినిమాలు బ్లాక్ బస్టర్‌గా నిలవగా మిగితా సినిమాలు మాత్రం అంత బజ్ క్రియేట్ చేయలేకపోయాయి. ముఖ్యంగా చెప్పాలంటే చేసిన ప్రతి సినిమా డిజాస్టర్‌గా మిగిలిపోయాయి.దీంతో ఈ అమ్మడుకు టాలీవుడ్‌లో ఆఫర్స్ రాకపోవడంతో తమిళ్, కన్నడ ఇండస్ట్రీస్ పై కన్నేసింది ఈ బ్యూటీ. ప్రస్తుతం అక్కడ వరస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నట్లు తెలుస్తోంది.అయితే ఓవైపు సినిమాలు చేస్తూనే, మరో వైపు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటుంది కృతి. ఎప్పటికప్పుడు వరస ఫొటో షూట్స్ చేస్తూ.. తన అందంతో మతి పోగొడుతుంది. తాజాగా ఈ బ్యూటీ, కురులు విర బోసి చేతిలో ఫ్లవర్స్ పట్టుకొని, ఫొటోలకు ఫోజులిచ్చింది. వైట్ కలర్ గౌన్‌లో సింపుల్ లుక్‌లో ఎంతో ముద్దుగా ఉంది ఈ అమ్మడు. ప్రస్తుతం ఈ ఫొటోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. కంటి చూపుతో చంపకు బేబీ అని కొందరు కామెంట్స్ చేస్తే, మరికొందరు మాత్రం, వైట్ డ్రెస్‌లో చాలా క్యూట్ గా ఉన్నావంటూ కామెంట్స్ చేస్తున్నారు.

